క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చింతల్: దేవీశరన్నవరాత్రులు, బతుకమ్మ పండుగ ఉత్సవాలను చింతల్ భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ వద్ద ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్‌ల నేతృత్వంలో బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షుడు బీసు వెంకటేశంగౌడ్, శ్రీనివాసులురెడ్డి, బీసు మధుగౌడ్ తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు



కుత్బుల్లాపూర్: బతుకమ్మ వేడకలు అంబరాన్నంటాయి. జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని నారాయణ పాఠశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగు రంగు పూలతో బతుకమ్మను అలంకరించి ఆపై గౌరమ్మను ప్రతిష్ఠించారు. బతుకమ్మ చుట్టు విద్యార్థులు, ఉపాధ్యాయులు తిరుగుతూ ఆడుతూ బతుకమ్మ ఆడారు. దీంతో స్కూల్ ఆవరణలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఐఎంసీ కళాశాలలో జీ-20 నమూనా సమావేశం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఐఐఎంసీ కళాశాలలో రెండు రోజుల పాటు జీ 20 నమూనా సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 10, 11 తేదీలలో కళాశాల సమావేశ మందిరంలో జరిగిన జీ 20 నమూనా సమావేశంలో దేశం ఐక్యంగా ఉండాలని, సమాజానికి ఐకమత్యమే బలమని, అది లేకపోతే ఆ సమాజం దుర్బలమౌతుందన్నారు. 8 ఎజెండా పాయింట్లపై చర్చించారు. మొదటి రోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, స్టార్టప్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్, కరెన్సీలు, యుద్ధం, టెర్రరిజం అంశాలతో పాటు రెండో రోజు సుస్థిరత, సుస్థిర వాతావరణ మార్పు, మహిళా సాధికారత, రాజకీయ అస్థిరత తదితరన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

కొండాపూర్ ఆస్పత్రిలో మార్చురీ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వినతి

రాయదుర్గం: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. రంగారెడ్డిజిల్లాలోని శేరిలింగంపల్లి ప్రాంతం ఐటీ రంగానికి కేంద్రంగా మారడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి చాలా మంది ఇక్కడ నివాసముంటున్నారని పేర్కొన్నారు. వారు ఉద్యోగాల నిమిత్తం విదేశాలలో పనిచేయడానికి వెళ్లగా వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసముంటున్నారని వివరించారు. ఈ క్రమంలో ఎవరైనా మృతి చెందితే వారు వచ్చే వరకు అంత్యక్రియల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని అందుకోసం గాంధీ, ఉస్మానియా, ఇతర ఆస్పత్రుల మార్చురీలో పెట్టాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేస్తే కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరువాసులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తగుచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్..

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జీడిమెట్ల: కుళ్లిన స్థితిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. చింతల్ హెచ్ఎంటీ అటవీప్రాంతంలో ఓ మృతదేహం పడి ఉన్నట్లు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల పెట్రోలింగ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ సంఘటనా స్థలికి వెళ్లి నిర్ధారించారు. ఎస్సై సతీష్‌రెడ్డి ఘటనాస్థలిలో శవ పంచనామా నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు దాదాపు 50 సంవత్సరాలు ఉంటుందని ఎస్సై తెలిపారు. మృతి చెంది నెలరోజులు అయ్యుండొచ్చని పేర్కొన్నారు.

ఎవరైనా హత్య చేసి పడేశారా? లేక యాచకుడా..

మృతిచెంది వ్యక్తి చుట్టు పక్కల యాచకుడా? లేక ఎవరైనా హత్య చేసి అటవీ ప్రాంతంలో పడేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



- సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలన
- ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వచ్చే పోస్టులపై చర్యలు
- సంబంధిత అడ్మిన్‌కు నోటీసులు.. తర్వాత క్రిమినల్ కేసులు నమోదు
- కలెక్టర్ ఆధ్వర్యంలో ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

నిఘా..!



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువత అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాల్లో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రతి జిల్లాలో మీడియా మానిటరింగ్ కమిటీ

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాల్లో నమోదు చేస్తున్న ప్రచారం కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ-జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కిరణ్‌కుమార్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు సభ్యులుగా ఉంటారు. వీరు ప్రతిరోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు..

ఏదైనా సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబందించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిషన్‌పై పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్షిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని అంటున్నారు.

జంగ్ తెలంగాణ 2023

అడుగడుగునా నిఘా.. విస్తృత తనిఖీలు

కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: అడుగడుగునా నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టే దిశగా కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో నలుగురిని ఎంపిక చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు బృందాలను ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ఆకస్మికంగా ప్రధాన రహదారుల వెంట తనిఖీలు చేపట్టనున్నారు. అదే విధంగా బహదూర్ పల్లి, ఐడీపీఎల్ ప్రాంతాల్లో నిరంతరం ఎన్నికలు ముగిసే వరకు ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి అక్కడే తనిఖీలు చేసి వాహనాలను పంపే ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి విషయంపై ఉల్లంఘనలు చేసే వారిపై టీమ్‌ను నియమించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది జీహెచ్ఎంసీ డివిజన్లతో పాటు కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగింపుతో పాటు ప్రచార పర్వంలో అభ్యర్థులు చేస్తున్న ఖర్చు విషయాలపై దృష్టి సారించనున్నారు. రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి ఒక్కో టీమ్‌లో ముగ్గురిని నియమించారు.

ఆయుధాలు కలిగి ఉంటే 16వ తేదీ వరకు అప్పగించాలి

కుత్బుల్లాపూర్: శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాలనగర్, మేడ్చల్ డివిజన్ల పరిధిలో ఆయుధాలు కలిగి ఉన్న వారికి ఇప్పటికే ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి వాటిని స్వాధీనం చేసుకునే దిశగా పోలీస్ ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు వాటిని అప్పగించాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, అల్లాపూర్, బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్టతో పాటు పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట్, అల్వాల్, జినోవ్యాలీ, మేడ్చల్, సూరారం, దుండిగల్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో అనేక మంది రక్షణ కోసం ఆయుధాలను వినియోగిస్తూ వస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో డీసీపీలు శబరిష్, శ్రీనివాసరావవులు, ఏసీపీలు, సీఐలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిపై చర్చించారు. ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టి అక్రమంగా ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్లే నగదు విషయంపై ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రంగారెడ్డినగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభ్యర్థి విజయానికి పని చేయాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్ బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ సమవేశాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరుగుతూ స్థానికంగా చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, నాయకులు జల్దా లక్ష్మీనాథ్, అబ్దుల్ ఖాదర్, సతీష్, లక్ష్మణ్‌గౌడ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, పద్మ, నీలగిరి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణతో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధిస్తా

కుత్బుల్లాపూర్: ప్రజల ఆదరణతో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధిస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆయనకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నగేష్, అదే విధంగా విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కోజి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తమ ప్రాంతంలో చేసిన అభివృద్ధికి కృతజ్ఞతగా వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ గంగయ్య, జనరల్ సెక్రటరీ శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ సాయిలు, మన్నెగిరి, అనూపోజు సోమేశ్వరరావు, జగదీష్, కుపిలి కోటేశ్వరరావు, లోకేష్, తిరుపతి, సూర్య, జోగారావు ఉన్నారు.



ఎమ్మెల్యేకు ఏగగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బాలయ్యనగర్ కమిటీ సభ్యులు

రాజీవ్ గృహకల్పలో నీటి ఎద్దడి

జగద్గిరిగుట్ట: నీళ్ల రావడం లేదని రాజీవ్ గృహకల్ప వాసులు బుధవారం వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం లేదని తిరిగి సాయంత్రం రాజీవ్ గృహకల్ప 1వ బ్లాక్ వద్ద ప్రధాన రోడ్డుపై బస్తీవాసులు కూర్చోవడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గత 6 నెలల క్రితం వరకు నీళ్లకు ఎటువంటి ఇబ్బంది కాలేదని, కుల సంఘాల పేరుతో జగద్గిరిగుట్ట కొండపై ఉన్న నీళ్ల ట్యాంక్ వద్ద మట్టిని తవ్వడంతో పైప్‌లైన్ పగిలిపోయిందన్నారు. అప్పటి నుంచి తమకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని బస్తీవాసులు తెలిపారు. ఆ పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టినా తిరిగి తమ సమస్య మొదటి కొచ్చిందన్నారు. నీళ్ల వదిలే సమయంలో ఈ లీకేజీ మూలంగా భారీగా నీళ్ల రోడ్లపై పారుతూ వృథాగా పోవడంతో ఆ పైప్‌లైన్ నుంచి నీటి సరఫరా ఆపేశారని స్థానికులు చెబుతున్నారు.

- ఇప్పుడు మైసమ్మనగర్ వెళ్లే పైప్‌పైన్‌కు కనెక్షన్ ఇవ్వడం అనుకున్నంత ప్రెషర్‌తో నీళ్ల రాకపోవడంతో సరిపోవడం లేదని తెలిపారు. తమ సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించాలని వారు కోరారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ అధికారి అంకిత్ భరద్వాజ్‌ను వివరణ కోరగా నీళ్ల ప్రెషర్‌తో రావడంలేదని అనడం వాస్తవమే. కాలనీ వాసుల సమస్యను అర్థం చేసుకొని నిత్యం నీటి సరఫరా చేసే సమయం కన్న ఓ గంట ఎక్కువగా వదులుతున్నామని తెలిపారు.



రాజీవ్ గృహకల్ప బ్లాక్-1 వద్ద ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న బస్తీవాసులు

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్: గాజులరామరం పరిధి సర్వే నం .329, 342, 306, 307, 12లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని కోరుతూ బుధవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా చేసుకుని పేదలకు అంటగడుతూ లక్షలాది రూపాయలు జేబుల్లో వేసుకుంటున్నారని, కూల్చివేతల్లో పేదలే నష్టపోతున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 329లో గతంలో ఎర్ర జెండాలు పాతిన సీపీఐ నాయకులపై పోలీసులు, రెవెన్యూ అధికారుల కేసులు పెట్టారని, ప్రభుత్వం భూమి అన్యాక్రాంతమవుతుంటే ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. మున్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలను అమలు చేసి అక్రమణలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ మండల కోశాధికారి సదానంద్, నాయకులు సుంకిరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, గుర్రప్పలు పాల్గొన్నారు.

బస్తీ స్థలాన్ని కాపాడి.. ప్రజావసరాలకు వినియోగించండి



గురుమూర్తినగర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం ఇదే..

రంగారెడ్డినగర్: బస్తీకి చెందిన స్థలాన్ని కబ్జా చెర నుంచి కాపాడి ప్రజావసరాలకు వినియోగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ కమిటీహాల్ ఎదురుగా ఏపీహెచ్‌బీ కాలనీ రోడ్డుకు ఆనుకుని ఉన్న 90 గజాల స్థలంలో గతంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. సదరు టాయిలెట్లు శిథిలావస్థకు చేరడంతో సదరు స్థలంపై కన్నేసిన ఓ మాజీ ప్రజాప్రతినిధి రాత్రికి రాత్రి పునాదులు తీసి పిల్లర్లు వేశారు. ఈ విషయంపై స్థానికులు అడ్డు చెప్పడంతో ఇది ప్రైవేట్ స్థలమని, కోర్టులో కేసు నడుస్తోందని పేర్కొన్నట్లు తెలిసింది. ప్రస్తుతం అధికార పార్టీలో కొనసాగుతున్న సదరు నాయకుడు కోర్టు వివాదంలో ఉన్న స్థలాన్ని కొంత మందికి అద్దెకు ఇవ్వడంతో ప్రస్తుతం కూరగాయల దుకాణం నడుపుతుండటం గమనార్హం.

బస్తీ దవాఖానా కల నెరవేరేనా..

కబ్జా చెరలో చిక్కుకున్న సదరు స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాల్సిందిగా పలుమార్లు బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌కు విన్నవించగా ఎట్టకేలకు ఆయన రూ.18 లక్షలు నిధులను మంజూరు చేయించారు. అయితే సదరు స్థలం వివాదం కోర్టులో ఉందని, కమిటీహాలు నిర్మించుకుంటారో.. మరో ఇతర కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటారో.. మీ ఇష్టమంటూ ఆయన చేతులెత్తేశారు. దీంతో నిధులు విడుదలైనా ఏమీ చేయలేని పరిస్థితిలో బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు ఉన్నారు. ఇటీవల అక్టోబరు 2వ తేదీన సదరు స్థలాన్ని సర్కిల్ అధికారులు స్వాధీనం చేసుకుని బస్తీ దవాఖానా లేక మహిళా భవనాన్ని ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు సమావేశమై తీర్మానం చేశారు. అధికార పార్టీ వ్యక్తి కావడంతో అటు అధికారులు ఇటు కార్పొరేటర్ చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా కళ్లెదుట ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనా అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ప్రగతినగర్ రోడ్డులో వన్‌వేతో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం



తప్పని ట్రాఫిక్ చిక్కులు

ఉదయం, సాయంత్రం వేళల్లో చుక్కలు

నిజాంపేట్: రోడ్డు పనులతో వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ ప్రధాన రోడ్డు మరమ్మతు పనులకు కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో మోర్ సూపర్ మార్కెట్ నుంచి ఇన్‌కాయిస్ సర్కిల్ వరకు రోడ్డును బ్లాక్ చేయడంతో ఒక వైపు నుంచే వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లోని రద్దీ సమయంలో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

- అటు కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ మీదుగా గండిమైసమ్మకు రాకపోకలు సాగించే వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. బాచుపల్లి, గండిమైసమ్మ, బహదూర్‌పల్లి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో విద్యా సంస్థలతో పాటు భారీ సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో ఈ రోడ్డు ప్రతినిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో అర కిలోమీటరు దాటాలంటే అర్ధగంట సమయం పడుతుండటంతో వాహనదారులు అసహనానికి గురవుతున్నారు.

కానరాని ట్రాఫిక్ సిబ్బంది

రోడ్డు పనులతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసి కూడా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా దారి మళ్లింపు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఒకే మార్గం గుండా అటు, ఇటు వెళ్లే వాహనాలు ఒకేసారి వస్తుండటంతో వాహనదారులు ముందు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. ఐదు రోజులుగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నా ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడంతో అధికారులు ప్రణాళిక లోపాన్ని స్థానికులు వేలెత్తి చూపుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని వాహనదారులు కోరుతున్నారు.



ప్రగతినగర్ రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం



కొనసాగుతున్న రోడ్డు మరమ్మతులు

బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మనూలో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కేంద్రాలైన ఔరంగాబాద్, బీదర్, భోపాల్, నూహ్, సంభాల్, శ్రీనగర్‌లలో, పాలిటెక్నిక్ కేంద్రాలైన బెంగళూరు, కడప, కటక్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మనూ 2023-24లో హాజరైన, అర్హత సాధించిన అభ్యర్థులు, ఇంతకుముందు నోటిఫై చేయబడిన తాత్కాలిక జాబితాలలో పేరు కనిపించని అభ్యర్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చని ఆమె వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత క్యాంపస్‌లలో వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ అక్టోబర్ 16న జరుగుతుందన్నారు. ఎంపికై న అభ్యర్థులు 19,20 తేదీలలో ఫీజు చెల్లించ వచ్చన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

15న క్యాట్ షో

పంజగుట్ట: ది ఫెల్లిన్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 15న 'క్యాట్ షో' నిర్వహిస్తున్నట్లు మలేషియాకు చెందిన పోటీల న్యాయనిర్ణేత సేస్ అబ్దుల్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌సీఐ హైదరాబాద్ ప్రతినిధి అబ్దుల్ మనన్, సక్వేబ్ పాథా, డాక్టర్ మురళిలతో కలిసి వివరాలు వెల్లడించారు.. అత్తాపూర్ లోని పిల్లర్ నెంబర్ 290, హెచ్.ఎఫ్ కన్వెన్షన్‌లో ఈ క్యాట్ షో జరుగుతుందన్నారు. సుమారు 250కి పైగా పిల్లులు పాల్గొంటాయని అందులో 13 బ్రీడ్స్ ఉన్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా మలేషియా, సింగపూర్, ఉక్రేయిన్, రష్యా, థాయిలాండ్, యూఎస్ నుంచి కూడా పిల్లుల పెంపకందారులు హాజరుకానున్న ట్లు తెలిపారు. పిల్లి హెడ్ స్ట్రక్చర్, బాడీ స్ట్రక్చర్, కంటి కలర్, వాటి హెల్త్ కండీషన్, బిహేవియర్ చూసి పాయింట్లు ఇస్తారన్నారు. పెట్ లవర్స్ తప్పకుండా ఈ షోను వీక్షించాలని కోరారు. కార్య క్రమంలో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.